www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 21 ఫిబ్రవరి 2024
5
చిత్తూరు

'ఆరణి' పార్టీలో ఉంటారా.. వీడుతారా..!

- పార్టీ, అధికారిక కార్యక్రమాల్లో కనిపించని ఎమ్మెల్యే
- ఆశించిన రాజ్యసభ స్థానంపై వైసీపీ మొండిచేయి
- పార్టీ వీడుతామంటున్న అనుచరులు
- ఆరు ఉమ్మడి జిల్లాల్లో బలిజలకు టికెట్ ఇవ్వలేదని వైసీపీపై విమర్శలు
- పార్టీలోనే ఉంటారా.. మారుతారా అనే సందిగ్ధత

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్: గత కొంత కాలంగా పార్టీ అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు. ఎమ్మెల్యే ఏడని నగర వాసులు ప్రశ్నలు సంధిస్తున్నారు. ఆరణి భవిష్యత్‌పై చిత్తూరులో సందిగ్ధత నెలకొంది. వైసీపీకి చిత్తూరు ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులు అత్యధిక మెజారిటీని అందించి శాసన సభ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. 2019లో 39వేల ఓట్ల ఆధిక్యంతో చిత్తూరు కేంద్రంలో వైసీపీ జెండాను రెపరెపలాడించారు. 2024లో మరో సారి

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

టికెట్ ఇచ్చేందుకు అధిష్టానం సుముఖత చూపకపోవడం, రాజ్యసభ చేజారి పోవడంతో ఆయన పూర్తిగా పార్టీ, అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా అధికార పార్టీ ఎం.సీ విజయానందరెడ్డి పేరును ఖరారు చేసింది మొదలు ప్రస్తుత ఆరణి శ్రీనివాసులు పెద్దగా కనిపించడం లేదు.

ఆయన ప్రస్థానం ఇలా..

ఆరణి శ్రీనివాసులు చిత్తూరు నియోజకవర్గం నుంచి 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసి పరాజయం పాలైయ్యారు. ఆ తరువాత ఆ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం అయ్యాక ఆయన టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. 2014లో ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ ఆశించి చివరిలో మాజీ ఎంపీ, టీటీడీ మాజీ ఛైర్మన్ ఆదికేశవులునాయుడు సతీమణిని డీఏ సత్యప్రభను అభ్యర్థిగా టీడీపీ అధిష్టానం బరిలోకి దించింది. టికెట్ దక్కకపోవడంతో ఆరణి శ్రీనివాసులు 2014 ఎన్నికల ముందు వైసీపీ తీర్థం పుచ్చుకొని టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి సత్యప్రభపై పోటీ చేసి 6800ఓట్లతో ఓటమిపాలైయ్యారు. ఆ తరువాత 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్‌పై గెలుపొందారు. రాయలసీమ జిల్లాల్లో బలిజ సామాజికవర్గం నుంచి ఏకైక ఎమ్మెల్యే కావడంతో మంత్రివర్గంలో స్థానం ఆశించి భంగపడ్డారు.

వైసీపీలో బలిజలకు మొండిచేయి..

ఉమ్మడి రాయలసీమ జిల్లాల్లో బలిజ సామాజికవర్గానికి ఎమ్మెల్యే స్థానం కేటాయించకపోవడంతో వైసీపీ అధిష్టానంపై బలిజలు, బలిజ సంఘాలు గుర్రు మంటున్నాయి. అటు నెల్లూరు, ఒంగోలు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. చిత్తూరు, తిరుపతి స్థానాల్లో అభ్యర్థులను కేటాయించే అవకాశం ఉన్నా సీఎం జగన్ తన సొంత సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇచ్చారని బలిజలు ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. 2024ఎన్నికల్లో తమ సత్తా ఎంటో వైసీపీకి రుచిచూపిస్తామని మండిపడుతున్నారు. అటు రాజ్యసభ స్థానాన్ని కేటాయిస్తామని చెప్పినట్లే చెప్పి ఆరణి శ్రీనివాసులకు ఇవ్వకపోవడంపై ఆయన అనుచరులు వైసీపీని వీడుతామని బహిరంగంగానే ప్రకటించారు.

కొనసాగుతారా.. పార్టీ మారుతారా..?

అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడడం, రాజ్యసభ చేజారిపోవడం నుంచి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పెద్దగా పార్టీ, అధికారిక కార్యక్రమాల్లో కనిపించడం లేదు. వైసీపీలోనే కొనసాగుతారా.. మారుతారా అనే చర్చ సాగుతోంది. అయితే ఆయన ప్రత్యక్షంగా ఎక్కడా తన భవిష్యత్ కార్యచరణపై ప్రకటించకున్నా.. అనుచరులు మాత్రం పార్టీ మారుతామని ప్రకటించారు.

కాగా ఆరణి పార్టీనే ఉంటారా.. ఉండరా అనే స్పష్టత ఆయన నుంచి రావాల్సి ఉంది.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు: పుల్లయ్య

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య అన్నారు. అందరి అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసే వీలు కల్పిస్తామని ఆయన అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో సంబంధిత అధికారులతో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్‌వో మాట్లాడుతూ ఇప్పటికే ప్రాక్టికల్స్ పూర్తి అయ్యాయని, మార్చి 1 నుంచి 20 తేదీ వరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 50పరీక్షా కేంద్రాల్లో 32,757మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. కేంద్రాల్లో సీసీ కెమెరాలు పర్యవేక్షణ, మొబైల్‌స్క్వాడ్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాల్లో మొదటి సారి పరీక్ష పత్రాల మూల్యాంకన నిర్వహించబోతున్నట్లు వివరించారు. కేంద్రాల వద్ద కల్పించాల్సి సదుపాయాలు, పకడ్బందీ ఏర్పాట్లు, 144సెక్షన్ అమలు తదితర అంశాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో డ్వామా పీడీ రాజశేఖర్, ఇంటర్మీడియట్ అధికారి సయ్యద్ మౌలా, ఇంటర్ బోర్డు అధికారులు, కలెక్టరేట్ సి సెక్షన్ సూపరింటెంట్ గుణశేఖర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు కలగకుండా పది పరీక్షలు..

అదేవిధంగా మార్చి18 నుంచి 30వ తేదీ వరకు 116 కేంద్రాలలో నిర్వహించనున్న పదవ తరగతి పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని డీఆర్‌వో పుల్లయ్య అధికారులను ఆదేశించారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. అధికారులు పలు సూచనలు చేశారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలని..



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న డీఆర్‌వో పుల్లయ్య

మార్చి 3వ తేదీ నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఆర్‌వో పుల్లయ్య అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోఆర్డినేషన్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పల్స్ పోలియోకు సంబంధించి పోస్టర్లును విడుదల చేశారు.

స్పందించకుంటే ఉద్యమం తీవ్రతరం

- ఏపి జేఏసి నేతల హెచ్చరిక

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఆర్థిక బకాయిల చెల్లింపు, సిపిఎస్ రద్దు, పిఆర్‌సి, డిఏ బకాయిల చెల్లింపు వంటి సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఏపి జేఏసి నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపి జేఏసి, ఎన్‌జీవో సంఘం పిలుపు మేరకు మంగళవారం స్థానిక పివికెయన్ కళాశాల నుండి కలెక్టరేట్ వరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపి జేఏసి రాష్ట్ర కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో మొద్దు నిద్రలో ఉందన్నారు. తమ న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించి పరిష్కరించకుంటే పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఏపి జేఏసి ప్రభుత్వం ముందుంచిన అన్ని సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జేఏసి ఛైర్మన్ కెవి.రాఘవులు, కార్యదర్శి రఘు, జిల్లా కార్యదర్శి ముత్యాలరెడ్డి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు, ఎస్‌టియు నాయకులు మదనమోహన్‌రెడ్డి, ఎపిటిఎఫ్ చంగల్‌రాయ మందడి జిల్లా నుండి వివిధ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల, పెన్షనర్లు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలు పర్కిరించాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల ర్యాలీ

1667 మందికి ఉద్యోగాలు..

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో రీజనల్ జాబ్‌మేళా నిర్వహించారు. మేళాకు ఏపీఎస్ ఆర్‌టీసీ వైస్ ఛైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి, జనరల్ మేనేజరు భారతి, అధికారులు పాల్గొన్నారు. 110బహుళ జాతీయ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 3862మంది నిరుద్యోగులు హాజరుకాగా వారిలో 1667మంది ఉద్యోగాలు పొందారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నా రని విజయానందరెడ్డి ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తెలిపారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు: జేసీ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఎన్నికల విధుల్లో ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా అందరూ అధికారులు తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల విధులు నుంచి మినహాయింపు కోరుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఎస్‌డిసి శివయ్య, డ్వామా పిడి రాజశేఖర్, ఇతర అధికారులు అభ్యర్థనలు చేసుకొన్న వారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులు, దివ్యాంగులు, పాలు ఇచ్చే తల్లులు, గర్భిణీ స్త్రీలు, పదవీ విరమణకు దగ్గరలో వున్న వారికి మినహాయింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులను భౌతికంగా పరిశీలించి మినహాయింపు పరిస్థితులను పరిశీలించారు.

'జనశక్తి-మనశక్తి' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ వైఎస్సార్ సీపీ నేత కాపురెడ్డి కష్ణారెడ్డి ప్రచురించిన జనశక్తి- మన శక్తి పుస్తకాన్ని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆవిష్కరించారు. స్థానిక పద్మావతి పురంలోని భూమన నివాసం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ కాపురెడ్డి కష్ణారెడ్డి రచించిన ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కష్ణారెడ్డి, ముని చంద్రారెడ్డి, రాజారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా పీవీకేఎన్ కళాశాల స్నాతకోత్సవం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం స్నాతకోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. కళాశాల ప్రాంగణంలో 2వ స్నాతకోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. విద్యావ్యవస్థలో మార్పులకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకొని లక్ష్యం వైపు దృష్టి సారించాలని ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. చిత్తూరులోని నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉన్నత విద్యలో సంస్కరణలు నిరంతరం జరుగుతున్నాయని దానికి అనుగుణంగా విద్యార్థులు అభివృద్ధి చెందాలన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యార్థులను అభినందించి దేశాభివద్ధికి పాటుపడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మరో అతిథి ఏపీ కళాశాల విద్య కమీషనర్ డా.పోలాభాస్కర్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్, రీసెర్చ్, ఉపాధి కోర్సులను ప్రవేశ పెడుతూ నాణ్యమైన విద్య, ఉద్యోగాల కల్పనకు కేంద్ర బిందువుగా ప్రభుత్వం మారిందని పేర్కొన్నారు. "ఒకచేతిలో డిగ్రీ పట్టా, రెండవ చేతిలో ఉద్యోగం (లెఫ్ట్ హ్యాండ్ డిగ్రీ .. రైట్ హ్యాండ్ జాబ్ ఆపర్చునిటి) ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు తమ జీవిత ఆశయాలను సాధించాలని, అప్పుడే తల్లిదండ్రుల కలలను నిజం చేసినవారవుతారని తెలిపారు. బంగారు పతకాలు, డిగ్రీ పట్టాలు పొందిన వారంతా భవిష్యత్‌లో ఇలాంటి వేదికలపై ప్రసంగించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

హక్కుల సాధనకై ఉద్యమం: రాధాకృష్ణ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఏపీఎస్ ఆర్‌టీసీ ఉద్యోగులు హక్కుల కోసం ఉద్యమించాలని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రెవిన్యూభవన్‌లో చిత్తూరు వన్ అండ్ టూ డిపోల్లోని డ్రైవర్లు, కండెక్టర్లతో సమావేశమైయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధనాల వల్ల అన్ని రంగాల ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఎపి జేఏసిలో భాగమైన ఏపిఎస్ ఆర్‌టిసి ఉద్యోగులు ఈనెల 22వ తేది నిర్వహించనున్న ఛలో అమరావతిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ నాయకులు కెకె.కుమార్, సర్ధర్, జనార్థన్‌నాయుడు, బలరామూర్తి, మణి, రజనికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

విద్యార్థులు ఇష్టమైన రంగంపై దృష్టి సారించాలి: జడ్జి

విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: విద్యార్థులు తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని సీనియర్ సివిల్ జడ్జ్, న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ ఐ.కరుణకుమార్ తెలిపారు. మంగళవారం చిత్తూరు నగరంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రపంచ సోషల్ జస్టిస్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో ప్రతి ఒక్కరికి సమాన హక్కు కల్పించడం జరిగిందన్నారు. భారత రాజ్యాంగంలో సూచించిన విధంగా సామాజిక, ఆర్థిక, రాజకియంగా అందరికీ సమాన హక్కులు ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వసతి గృహాన్ని, వంట గదిని పరిశీలించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాలల కన్వీనర్ అరుణ, అసిస్టెంట్ సోషల్‌వెల్ఫేర్ ఆఫీసర్ నాగేశ్వరరావు, ట్రైబల్‌వెల్ఫేర్ అధికారి మూర్తి, ప్రిన్సిపాల్ జయభారతి, తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయ విజ్ఞాన సదస్సును పలమనేరు సీనియర్ సివిల్ జడ్జ్, చైర్మన్ పగడాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సమావేశంలో న్యాయవాది భాస్కర్ మాట్లాడుతూ బాల్యవివాహాలు, ప్రామిసరీ నోట్, డ్రైవింగ్ లైసెన్స్ గురించి, పిల్లలకు ప్రాథమిక హక్కులు, విధులు గురించి వివరించారు. న్యాయాన్ని ఖండించకు, అన్యాయాన్ని సహించకు తారతమ్యాలు లేకుండా అందరికీ సమన్యాయం అందించాలి అని తెలిపారు. సమావేశంలో న్యాయవాదులు ఆరిఫ్ ఉల్లా ఖాన్, ఎంఈవో బాలసుందరం, హెచ్ఎం షంషేర్, ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ సర్కార్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా...

అన్నా క్యాంటీన్లను ఆపేది లేదు

- 'నిజం గెలవాలి' పర్యటనలో నారా భువనేశ్వరి

గుడిపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తూ

ప్రజాశక్తి - గుడిపల్లి

'అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌లో ఆకలి అనే పదం వినబడకూడదనే మహోన్నత లక్ష్యంతో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు 2018లో అన్నా క్యాంటీన్లను ప్రారంభించారని, రాష్ట్రవ్యాప్తంగా 364 క్యాంటీన్లను ఏర్పాటు చేశారని, అయితే జగన్ సర్కార్ అన్నా క్యాంటీన్లను నిలిపేసి పేదవాని పొట్టకొట్టింది' అని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. కుప్పం నియోజకవర్గంలో రెండు రోజుల 'నిజం గెలవాలి' పర్యటనలో భాగంగా గుడిపల్లిలో అన్నాక్యాంటిన్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. అదేవిధంగా 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఇటీవల చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుతో తీవ్ర మనోవేదనతో మృతిచెందిన కొడతాంపల్లి వాస్తవ్యుడు వెంకటేష్ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అలాగే యముగానిపల్లికి చెందిన కొండప్ప కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అన్నా క్యాంటిన్ ప్రారంభించిన అనంతరం నారా భువనేశ్వరి మీడియాతో మాట్లాడుతూ కుప్పం కుటుంబ సభ్యుల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటిన్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, కుప్పం నియోజకవర్గ సమన్వయ కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్, మాజీ జడ్‌పిటిసి బేటప్పనాయుడు, మండల అధ్యక్షులు బాబునాయుడు, నాయకులు శ్రీనివాసులు, హేమంబార్ గౌడ్ స్వాగతం పలికారు. అంతకుముందు కర్నాటక రాష్ట్రం కోలార్ జిల్లా బేటరాయణహల్లి గ్రామంలో నంది గోశాలను సందర్శించి గోమాతకు పూజ చేశారు. అక్కడనుంచి రోడ్డు మార్గంలో గుడిపల్లికి విచ్చేశారు. బుధవారం కుప్పం, రామకుప్పం, శాంతిపురం మండలాల్లో పర్యటించనున్నారు.

నేడు రామకుప్పంలో పర్యటన

రామకుప్పం : ఎన్టీఆర్ ట్రస్టు ఛైర్మన్ నారా భువనేశ్వరి బుధవారం రామకుప్పంలో పర్యటించనున్నారని చంద్రబాబు పిఎ మనోహర్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మునస్వామి, మండల అధ్యక్షులు ఆనందరెడ్డి, కార్యదర్శి నరసింహులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం పోలీసు స్టేషన్ సర్కిల్ వద్ద అన్నా క్యాంటీన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. మాజీ మండలాధ్యక్షులు ఆంజనేయరెడ్డి, నేతలు సీతాపతి, చిన్నక్రిష్ణ పాల్గొన్నారు.

రామకుప్పంలో సన్నాహక ఏర్పాట్లు

ఉద్యోగం వచ్చాక వదిలేశాడు..

- మీడియాను ఆశ్రయించిన మహిళ

మీడియాతో ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితురాలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రేమించి పెళ్లి చేసుకున్న తన భర్తకు పోలీసుశాఖలో హోంగార్డు ఉద్యోగం వచ్చిన తర్వాత తనను వదిలేశాడని ఆరు నెలల నుంచి అతని ఆచూకీ కోసం తిరుగుతున్నానని భార్య శ్రీదేవి తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. తాము తిరుపతిజిల్లా పుత్తూరులో నివాసం ఉంటున్నామని చెప్పారు. పుత్తూరులోని ఓ డిగ్రీ కళాశాలలో ఇద్దరం పనిచేస్తున్న సమయంలో.. ప్రేమిస్తున్నానని చెప్పి రామచంద్రన్ తనను 2021లో పెళ్లి చేసుకున్నాడని తెలిపారు. ఆ తర్వాత పోలీసుశాఖలో హోంగార్డు ఉద్యోగం రావడంతో నన్ను వదిలించుకోవాలని ప్రయత్నం చేశాడని చెప్పారు. దీనిపై ఉమ్మడి జిల్లాలో పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసేందుకు తాను చేసిన ప్రయత్నాలను అతని కుటుంబ సభ్యులు అడ్డుకున్నారని ఆరోపించారు. తన ప్రాణానికి తన భర్త కుటుంబ సభ్యుల నుంచి ముప్పు ఉందని, నా భర్త ఆచూకి తెలిపి అతనితో నన్ను కలిపించేలా పోలీసు ఉన్నత అధికారులు న్యాయం చేయాలని ఆమె కన్నీటి పర్యంతమైయ్యారు.

'యువత' ప్రతిభ వెలికి తీసేందుకే క్రీడలు

విజేతలను బహుమతి ప్రదానం చేస్తున్న జేసీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో క్రీడా అనుభవాలను వెలికి తీసి నైపుణ్యాన్ని పెంచేందుకు 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం నిర్వహించినట్లు జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. విశాఖలో జరిగిన 'ఆడుదాంఆంధ్ర' ముగింపు కార్యక్రమంలో వాలీబాల్ టోర్నమెంటులో మూడవ స్థానం పొందిన గుడిపాల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన యువకులను ఈ సందర్భంగా జేసీ అభినందించారు. భవిష్యత్తులో క్రీడా నైపుణ్యాన్ని మరింతగా పెంపొందించుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా అధికారి బాలాజీ, కొత్తపల్లి యువకులు గోపి, సూర్య, సుజిత్, దిలీప్, సతీష్, కార్తీక్, తంబు, విమల్‌రాజ్, రామన్, నందకుమార్, నవీన్‌లను అభినందించారు.

'హంద్రీ నీవా' పరిశీలన

హంద్రీనీవా కాలువ పరిశీలిస్తున్న మంత్రి, అధికారులు

ప్రజాశక్తి-రామకుప్పం: హంద్రీనీవా కాలువను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ నెల 26న శాంతిపురం మండలంలో సీఎం వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో మంగళవారం ఇక్కడకు వచ్చారు. ఏర్పాట్లు పరిశీలనకు వచ్చిన ఆయన రామకుప్పంలో హంద్రీనీవా కాలువను సందర్శించి జలాలకు పూజలు చేశారు. అనంతరం శాంతిపురంకు వెళ్లి సీఎం సభా ఏర్పాట్లుపై జిల్లా కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ జాషువా, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్, ఎంపీ రెడ్డప్ప, జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, రెస్కో ఛైర్మన్ సెంథిల్, డీఎస్పీ శ్రీనాథ్, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జెడ్పిటిసి నితిన్ రెడ్డి, బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ బడ్జెట్, సాధారణ సమావేశాలు బుధవారం నిర్వహించనున్నట్లు నగర మేయర్ అముద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు బడ్జెట్ సమావేశం, మధ్యాహ్నం కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎక్స్ అఫిషియో సభ్యులు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, నగరపాలక అధికారులు హాజరుకావాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-సోమల: మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఈశ్వరయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖల అధికారులు శాఖాపరమైన అజెండాలతో హాజరుకావాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు తప్పక హాజరవ్వాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-ఐరాల: పశుసంవర్ధక శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న ధనుంజెయులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జెఎసి గౌరవ అధ్యక్షులు ఓంప్రకాష్ రెడ్డి, చైర్మన్ బాలసుబ్రమణ్యం, ప్రధానకార్యదర్శి జ్యోతీశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఇన్వెర్టర్ వితరణ

ప్రజాశక్తి-కార్వేటినగరం: ఎంఈవో కార్యాలయానికి శ్రీలక్ష్మీనరసింహ విద్యాసంస్థలు ఆధ్వర్యంలో కరెస్పాండెంట్ దిలీప్‌కుమార్ మంగళవారం ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌కుమార్‌లకు ఇన్వెర్టర్‌ను అందజేశారు. ఎంఈవో విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయానికి ఇన్వెర్టర్ అందించడం అభినందనీయమని కొనియాడారు. విద్యాసంస్థలు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని తెలిపారు. ఎంఈవోలు కరెస్పాండెంట్‌ను శాలువతో ఘనంగా సన్మానించారు.

వెంకటయ్య మృతికి నివాళి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని దేవరగుడిపల్లికి చెందిన వెంకటయ్య సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు అక్కడకు చేరుకొని మృతదేహానికి నివాళులర్పించారు. నాయకులు మోహన్‌మురళి, బుజ్జిబాబు, సంజీవయ్య, శివ, సతీష్, వరప్రసాద్ తదితరులు నివాళులర్పించారు.

దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: కుష్టి వ్యాధిగ్రస్తులకు మంగళవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో దాత రవి దుస్తులు పంపిణీ చేపట్టారు. వైద్యులు సాయి షర్మిల మాట్లాడుతూ కుష్టి వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి కావలసిన వసతులను ఏర్పాటు చేయడంలో డిపిఎమ్ఓ మణి ఎంతో చొరవ చూపిస్తున్నారని వారికి అండగా ఉండాలనే ఉద్దేశంతో దాతల సహాయంతో వస్త్ర దానం అందివ్వడం అభినందనీయం అన్నారు. అనంతరం దుస్తుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో వైద్యులు శిరీష, ఐసిటిసి కౌన్సిలర్ బాబు, సిబ్బంది జయచంద్ర, శివకుమార్ పాల్గొన్నారు.

'విద్యాప్రమాణాలు మెరుగుపడాలి'

ప్రజాశక్తి-ఐరాల: విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారి రుశేంద్రబాబు, దామోదర్‌నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాప్రణాళికపై మండలస్థాయి, ప్రైమరీ స్థాయి సమావేశాలకు కోర్స్ డైరెక్టర్‌గా హెచ్‌ఎం బి.కోమల వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా రుశేంద్రబాబు, దామోదర్‌నాయుడు హాజరై మాట్లాడుతూ టోఫెల్‌ను ఉపాధ్యాయులు పాఠశాలలలో చక్కగా అమలు చేసి, విద్యార్థులను ఆంగ్ల భాషలో ప్రపంచ స్థాయి విద్యార్థులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఐఎఫ్‌పి, స్మార్ట్ టీవీలను చక్కగా ఉపయోగించుకుని డిజిటల్ శిక్షణను విద్యార్థులకు అందించి, గ్లోబల్ విద్యార్థులుగాలని ఆకాంక్షించారు. అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులలకు రెమిడీలు శిక్షణ అందించి కనీస అభ్యసన స్థాయిని పెంపొందించి రానున్న పరీక్షలకు సంసిద్ధులను చేయాలని కోరారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండలంలోని కత్తెరపల్లి పాఠశాలలో సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయుడు సుదర్శనరాజును మంగళవారం పలువురు ఘనంగా సన్మానించారు. పలు మండలాల్లో సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయులుగా ఆయన పని చేసి పదవీ విరమణ పొందారు. జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి హేమారెడ్డి మాట్లాడుతూ 40సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగడం ఎంతో గొప్ప అని కొనియాడారు. ఎందరో విద్యార్థుల జీవితాలను ఉన్నత స్థానానికి చేర్చిన సుదర్శన్ ంరాజు ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయుడని అన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, చలపతిరావు, వేణుగోపాల్, భీమారావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'గ్రామస్థాయిలో కార్పొరేట్ వైద్యం'

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నట్లు ఎంపీడీవో శివశంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని జిల్లేడుపల్లి సచివాలయంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం సర్పంచ్ భారతి ఆధ్వర్యంలో జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు లోహిత్ చంగల్‌రాయలు, శిరీష, సంధ్యారాణి, షాలిని, మాజీ సర్పంచి అశోక్‌కుమార్ రెడ్డి, గ్రామస్తులు పద్మనాభరెడ్డి, బాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి ఎంపీపీ స్కూల్‌లో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం తీర్థం ప్రాథమిక ఆరోగ్య వైద్య అధికారి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 350 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారెడ్డి, డాక్టర్ కిజియరాణి, డాక్టర్ చైత్ర, డాక్టర్ అరుణ్ కుమార్, పద్మావతి, కాంతమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

అవగాహన కార్యక్రమంలో బ్యాంకు అధికారులు

ప్రజాశక్తి-ఐరాల: మండలంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ పొలకల నాబార్డ్ వారి సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. పొలకల వద్ద మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌బీఐ మేనేజర్ హనుమంతు నాయక్, సిసి ఎన్.మునిరాజ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకు స్కీమ్‌లు, లోన్‌లు, బీమా పథకాల గురించి వివరించారు. సైబర్ నేరాల అవగాహన కల్పించారు. ఎం.వి.రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ కళాజాత బృందం, మహేష్, చంద్ర, అశోక్ గ్రామప్రజలకు అర్థమయ్యే రీతిలో కళాకారులు, మ్యాజిక్ షో ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో సంఘమిత్రలు మునస్వామి, భారతి, సుజాత, మంగమ్మ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనాటి బాలలే రేపటి పౌరులు.. ఎన్నికల నిర్వహణ పోలింగ్ పై అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించామని గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూలు కరస్పాండెంట్ శివకుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని దర్గా వీధిలో శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులకు పోలింగ్ ప్రక్రియ, ఓటు వేసే పద్ధతిని తెలిపారు. చిన్నారులు ఆసక్తిగా ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి భారతీయుడు హక్కు అని చిన్నతనం నుండి ఓటింగ్ గురించి తెలిపేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తు న్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్లయ్య, వాసు, రాఘవయ్య, మస్తాన్ బి, నజీరా, మంజుల, హరిత, గౌరీ విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

'విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి'

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ప్రతి విద్యార్థి విద్యాభ్యాసంతో పాటు, వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని దొరవారి సత్రం పిహెచ్‌సి వైద్యాధికారి వి చైతన్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంజెపి గురుకుల పాఠశాలలో ఆరోగ్య సిబ్బంది మెడికల్ క్యాంప్ మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాధారణ వ్యాధులకు చికిత్స అందించారు. టైఫాయిడ్ అనుమానిత విద్యార్థులను పిహెచ్‌సిలో రక్త పరీక్షలు చేయించుకోవాలని సిఫార్సు చేశారు. ప్రతి విద్యార్థి అనారోగ్యానికి గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. శారీరక పరిశుభ్రత పాటించి గజ్జి, తామర వంటి వ్యాధులను దూరం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పి మౌనిక, ఏఎన్ఎం డోరతి, శ్రావణి, హెచ్ ఎ సుధాకర్, గురుకుల కళాశాల స్టాఫ్ నర్స్ రెడ్డమ్మ, మోనిషా పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను మారిస్తే జగన్ గెలుస్తాడా?

- దంపూరు భాస్కర్ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైసిపి మళ్లీ అధికారంలోకి రావడానికి జగన్ ఎమ్మెల్యేల స్థానాలను మార్చినంత మాత్రాన గెలుస్తాడనుకోవడం భ్రమేనని టిడిపి రాష్ట్ర కార్యదర్శి దంపూర్ భాస్కర్ యాదవ్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో సిద్ధం హోర్డింగులు ఎవరి నిధులతో ఏర్పాటు చేశారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో భూములు, ఇసుక ప్రకృతి సహజ వనరులను ఇష్టానుసారంగా దోచుకున్న వైసిపి సర్కారుకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పడానికి ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రకోటి సదాశివం, ఆనంద్ యాదవ్, రామ్మూర్తి, జగన్నాథం, హేమంత్ రాయల్, వెంకటేష్, మునికృష్ణ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు అభినందనలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి ఉమెన్స్ డిగ్రీ , పీజీ కళాశాల, తిరుపతి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు వక్తృత్వ పోటీల్లో బహుమతులను సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి నారాయణమ్మ అభినందించారు. ప్రధానమంత్రి వికసిత్ భారత్ 2047 ప్రణాళికను విద్యార్థినులు ముందుకు తీసుకుపోవాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి పంచ్ ప్రాణ్ లో భాగంగా జరిగిన పోటీలలో విద్యార్థినులు విస్తృతంగా పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా విద్యార్థినులు ఉండటం వల్ల సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తారనే సందేశాన్ని అందించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్. వి. కృష్ణవేణి, తెలుగు విభాగాధిపతి మాట్లాడుతూ విద్యార్థినులలో సేవా భావం పెంపొందడానికి ఈ కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్. సి. దివ్యవాణి, కెమిస్ట్రీ ఉపన్యాసకులు మాట్లాడుతూ విద్యార్థినుల సర్వతో ముఖాభివృద్ధికి ఎన్ఎస్ఎస్ ఆలంబనగా నిలుస్తుందన్నారు. కళాశాల యూనియన్ ఇన్‌చార్జ్ డాక్టర్. సి. భువనేశ్వరి, కామర్స్ విభాగాధిపతి డాక్టర్. కె. మల్లేశ్వరి విద్యార్థినులకు అభినందనలు తెలిపారు.

తుమ్మలగుంట ఆక్రమణలు తొలగిస్తాం

హాథీరాంజీ మఠం ఫిట్ పర్సన్ రమేష్‌నాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట పరిధిలోని హాథీరాంజీ మఠం భూములను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను పూర్తిగా స్థాయిలో తొలగిస్తామని మఠం డిప్యూటీ కలెక్టర్, ఫిట్ పర్సన్ రమేష్‌నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ మఠం భూములను ఆక్రమించి కొందరు కబ్జారాయుళ్లు ప్లాట్స్‌గా విక్రయించి అక్రమ భూదందా చేస్తున్నారని, ఈ నెల 15న రెవెన్యూ, మఠం అధికారులు సంయుక్తంగా అక్రమించి నిర్మిస్తున్న ప్రహరీగోడలను తొలగించారన్నారు. కొంత మంది నిర్మాణాలను కొనసాగిస్తున్నారనే సమాచారంతో సోమవారం తిరుపతి రూరల్ తహశీల్దారు మహబూబ్ చాంద్, మఠం ఏఈఓ శ్రీనివాసులురెడ్డి మఠం భూములను సందర్శించారన్నారు. ఆ సమయంలో ఆక్రమణ దారులు వారిని అడ్డుకోవడమే కాకుండ చుట్టుముట్టి వాగ్వాదానికి దిగారని, మఠం భూములను ఆక్రమించడం, కట్టడాలను కొనసాగిస్తే వాటిని కూల్చివేసి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మఠం భూములను దొంగదారిలో విక్రయించి సామాన్యులను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉమ్మడి అభ్యర్థి గెలుపే ధ్యేయంగా పనిచేయాలి: జనసేన

ప్రజాశక్తి - గూడూరు రూరల్: జనసేన, టీడీపీల ఉమ్మడి అభ్యర్థి గెలుపే ధ్యేయ్రపజుంగా జనసైనికులు పనిచేయాలని జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు కోరారు. జనంలోకి జనసేన, భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గమళ్ళపాలెం, కటకరాజా వీధి, మహాలక్ష్మమ్మ వీధి, అంకమ్మ వీధిల్లో టిడిపి గూడూరు ఇన్‌ఛార్జి పాశం సునీల్ కుమార్ సతీమణి సంధ్యా రాణి, నాయకులతో కలిసి నిర్వహించిన ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రాక్షస పాలన అంత మొందించేందుకు జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తున్నాయన్నారు. పొత్తులో భాగంగా గూడూరులో ఉమ్మడి అభ్యర్థిగా ఎవరు పోటీ చేయాలనే విషయం పవన్ కళ్యాణ్, చంద్రబాబు నిర్ణయిస్తారని ఉమ్మడి అభ్య ర్థి ఎవరైనా గెలుపునకు కృషి చేయాలన్నారు. మాజీ కౌన్సి లర్ పులిమి శ్రీనివాసులు మాట్లా డుతూ రాబో యేది ప్రజా ప్రభుత్వమే అని రాబో యే ఎన్నికల్లో ప్రజలు వైసీపీని తరిమి కొట్టడం ఖాయ మన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన ఉమ్మడి కార్యక్రమాల పీఓసీ మోహన్, రాజ శేఖర్, కుమార్, కోటా వెంకటేశ్వర్లు,ఓంకార్, శ్రీనాథ్, సూర్య,సాయి,శివ, విజయ్, నారాయణ, మనోజ్, కోటి, వసంత్ టీడీపీ రాష్ట్ర నాయకులు శీలం కిరణ్ కుమార్, శ్రావణి రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, భారతి, పిల్లెల్ల శ్రీదేవి, గురవయ్య, కొడిపర్తి కల్పన,రహీమ్, అల్లి భాయ్, పులిమి శివకుమార్, శ్రీనివాసులు, చిన్నా పాల్గొన్నారు.

వలంటీర్లది ముఖ్య పాత్ర: డిప్యూటీ సీఎం

వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: సచివాలయ వ్యవస్థలో వలంటీర్లది ముఖ్య పాత్ర అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు అనునిత్యం కృషి చేశారని కొనియాడారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని వలంటీర్లకు సేవా రత్న, వజ్ర, మిత్ర అవార్డులను ప్రదానం చేశారు. వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, గుణశేఖర్ రెడ్డి, చిన్నమ్మరెడ్డి, వెంకటరెడ్డి, ఏకాంబరం, కమలాకర్‌రెడ్డి, హరిబాబు, వేలు, బలరామిరెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా వలంటీర్లు ఉన్నారని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వలంటీర్లలకు సత్కార కార్యక్రమం ఎంపీపీ అమరావతి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, జెడ్పీటీసీ సోమశేఖర్, సింగల్ విండో అధ్యక్షులు దత్తరెడ్డి, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ అమర్నాథ్, సర్పంచులు ప్రసాద్‌రెడ్డి, ఉమాదేవి, భారతి, వాణిప్రియ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

డిసోమియా సన్మానిస్తున్న ఎంఈవో

ప్రజాశక్తి-కార్వేటినగరం: నాలుగు రోజుల క్రితం యాదమరి మండలంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్స్పైర్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో రెండవ స్థానాన్ని పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. స్థానిక లక్ష్మీనరసింహ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని డిసోమియాను మంగళవారం స్థానిక ఎంఈవోలు విజయకుమార్, మనోజ్‌కుమారులు ఘనంగా శాలువాలు కప్పి సన్మానించారు. వారు మాట్లాడుతూ డిసోమియా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం మండలానికే గర్వకారణమన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా రాణించి జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. ఈ సందర్భంగా డిసోమియాను ప్రోత్సహించిన సైన్స్‌టీచర్ మోహన్‌ను కళాశాల కరెస్పాండెంట్ దిలీప్‌కుమార్‌ను, హెచ్ఎం మహేశ్వరరాజును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పృథ్వీరాజ్, భూపతిలు పాల్గొన్నారు.

ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా మిద్దిల హరి

సమావేశంలో మిద్దిల హరి ఆర్టీసీ వైస్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ బోర్డు వైస్ ఛైర్మన్ గా వైసీపి జిల్లా అధ్యక్షులు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, మాజీ ఆప్కో డైరెక్టర్ మిద్దిల హరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మిద్దిల హరి వర్గీయులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి మిద్దిల హరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఆర్టీసీ వైస్ ఛైర్మన్ గా వున్న విజయానంద్ రెడ్డిని చిత్తూరు అసెంబ్లీ వైసీపి ఇన్‌ఛార్జిగా నియమించడంతో విజయానంద్ రెడ్డి ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆ పదవి శ్రీకాళహస్తికి చెందిన మిద్దిల హరిని వరించింది. బుధవారం విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో బోర్డు సమావేశం వుంది. ఈ

వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వేసవి నేపథ్యంలో ఎండతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న వీధి వ్యాపారులకు ప్రత్యేక రాయలసీమ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కూరపాటి సురేష్ బాబు ఆధ్వర్యంలో గొడుగులను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. తిరుపతి నగరంలో పుట్ పాత్ లపై సామాన్య చిరు వ్యాపారులు బతుకు జీవనం సాగిస్తున్నారని, వారికి ఎండ వేడిమి నుండి ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో ఈ గొడుగుల వితరణ చేస్తున్నామని సురేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక రాయలసీమ సాధన సమితి ప్రతినిధులు నాగరాజు రెడ్డి, అబ్దుల్ రఫీ, సురేష్, సుదర్శన్ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరులోని గమళ్ల పాలెంలో మెప్మా , మున్సిపాలిటీ సౌజన్యంతో నిర్వహిస్తున్న మై ఫెండ్స్ అసోసియేషన్ వసతి గృహంలో మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. యువత సేవా కార్యక్రమాలు వైపు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మయూరి శ్యామ్ యాదవ్, సతీమణి మహేశ్వరి, వసతి గృహ నిర్వాహకుడు రమేష్ పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ పై అవగాహన

ప్రజాశక్తి- వాకాడు: మండలంలోని మొలగునూరు పశువైద్యాధికారి సిహెచ్ఎస్ కృష్ణారావు పశు విజ్ఞాన కార్యక్రమంలో భాగంగా బుడిధలవాగు, , కొండూరు వావిళ్ళ పాలెం పరిసర ప్రాంతాలను మంగళవారం సందర్శించారు. స్థానికులకు బర్డ్ ఫ్లూపై అవగాహన కలిగించారు. వాటితో పాటు వారి కోళ్లను పరిశీలించి వారికి తగిన జాగ్రత్తలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణా రావు మాట్లాడుతూ వారంలో రెండు ఆర్‌ఆర్‌టి టీములు అన్ని గ్రామాలను సందర్శించి కోళ్ల పెంపకదారులకు తగు సూచనలు అందిస్తారని, ప్రస్తుతానికి మండల లో ఎటువంటి బర్డ్ ఫ్లూ లక్షణాలతో కోళ్లు లేవని వాటిపై అపోహలు వద్దని తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ప్రభుత్వ పాల్ టెక్నిక్ కళాశాలలో వైఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ ను వైసీపీ రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్ రెడ్డి, గూడూరు ఎంపిపి గురవయ్య చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు పట్టణ, మండల పరిధిలో 13 జట్లు పాల్గొంటున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొం దించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, అశోక్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

ప్రజాశక్తి -రేణిగుంట : రేణిగుంట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో 'బేటీ పడావో, బేటీ బచావో'ను నిర్వహించారు. బాల్య వివాహాలు నిర్మూలనలో భాగంగా రేణిగుంట, ప్రధానోపాధ్యాయులు, విష్ణువర్ధనం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11 సంవత్సరాల నుంచి 16 సంవత్సరాల బాలికలకు, బాల్యవివహాలు చేసుకుంటే బాలికలు అనారోగ్యానికి గురై మానసిక ఒత్తిడిని తట్టుకోలేక అనేక రకాలుగా, విద్య, , జీవితానికే అభివృద్ధి దూరమ వుతుందని, తల్లిదండ్రులు బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత వివాహం చెయ్యాలంటే . చైల్డ్ హెల్ప్ లైన్ కి గానీ, తమకు గాని లేదా, గ్రామంలో వున్న అంగన్‌వాడీ టీచర్స్ తెలపాలన్నారు.

'సామాజిక న్యాయమే లక్ష్యం'

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సామాజిక న్యాయం అందించడమే న్యాయ సేవా ధికార సంస్థ లక్ష్యం అని పుత్తూరు సీనియర్ న్యాయవాది లక్ష్మీపతి పేర్కొన్నారు. పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర ఆదేశాల మేరకు స్థానిక కాపు వీధిలోని ఎంపీయూపీ పాఠశాలలో న్యాయ సేవ దినోత్సవం, న్యాయ విజ్ఞాన సదస్సును పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు ఈ సందర్భంగా న్యాయవాది లక్ష్మీపతి మాట్లాడుతూ పేద, ధనిక భేదం లేకుండా, చట్టపరంగా ప్రజలందరికీ సమానం న్యాయం కల్పించాలని ఐక్యరాజ్యసమితి పిలుపు నిచ్చిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు, న్యాయ సేవ అధికారి సంస్థ ప్రకృతి వైఫల్యాలకు గురైన వారికి షెడ్యూల్ కులాలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తుందన్నారు.

క్రైం న్యూస్

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-పుంగనూరు: క్వారీ గుంతలో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం పుంగనూరు మండలంలో వెలుగుచూసింది. స్థానికుల వివరాల మేరకు.. రొంపిచర్ల మండలం చిచ్చిలివారిపల్లికు చెందిన రెడ్డెమ్మ, నాదమునిరెడ్డిల కుమార్తె మాధవి(27). తిరుపతిలో బి ఫార్మసీ చదువుతున్నప్పుడు శ్రీనివాసులు నాయక్‌ను ప్రేమించి కులాంతర వివాహం చేసుకుంది. 8ఏళ్లుగా కలిసి ఉంటున్నారు. వీరికి జ్యోష్ణప్రియ(7), షణ్ముకప్రియ(5) ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా శ్రీనివాసులు నాయక్ వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. తరుచూ గొడవపడేవారు. జీవితం మీద విరక్తితో మాధవి(27) సమీపంలోని క్వారీ వద్దనున్న గుంతలో పడి ఆత్మహత్య చేసుకుంది. మాధవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. ఆమె బంధువులు భర్త శ్రీనివాస్ నాయక్ వచ్చేంతవరకు పోస్టుమార్టం నిర్వహించకూడదని పట్టుబట్టారు. దింతో ఆసుపత్రి ఆవరణంలో కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొన్నది. పోలీసులు జోక్యం చేసుకొని మాధవి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని గుండిగల్లుకు చెందిన రైతు చెంగమ్మ గ్రామ పొలిమేరలో తన వ్యవసాయ పొలంలో రాతి మిద్దెపై ఉన్న గడ్డివామికి ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. గడ్డితో పాటు మిద్దెలో ఉన్న వ్యవసాయ సామాగ్రి, అరటి తోట కాలిపోవడంతో రూ. 2లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు. దీంతో సోమవారం గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కాగా న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు.

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రభుత్వ నిబంధలనకు విరుద్ధంగా అక్రమంగా తీసుకొస్తున్న 24 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ తెలిపారు. గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ గూడూరు మండల పరిధిలోని మెగనూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్ట్ చేశామన్నారు. అతని దగ్గర 24 బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు ఆయన తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని బాలిక మృతి

ప్రజాశక్తి -రేణిగుంట : రేణిగుంట మండలం గాజుల మద్యం పంచాయతీలో మంగళవారం సాయంత్రం డాక్టర్ ఢీకొని ఐదేళ్ల బాలిక మృతి చెందింది. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వికాస్ భార్యా బిడ్డలతో వలస కూలీగా ఇక్కడికి వచ్చాడు. ఈ క్రమంలో శ్రీ మారుతి బ్రిక్స్ పరిశ్రమలో ఇటుక కూలీగా భార్యాభర్తలిద్దరూ పనిచేస్తున్నారు. కూతురు నిద్రపోతుండగా ట్రాక్టర్ వెనక నుండి తిప్పుతూ పాపను ఢీకొనడంతో పాప చాందిని తీవ్రంగా గాయపడింది. వెంటనే పాపని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభినవ శ్రీకృష్ణదేవరాయలు తులసీనాథంనాయుడు

ప్రజాశక్తి-గంగవరం: చరిత్రలో తెలుగుభాషకు, సాహిత్యానికి విశేష సేవ చేసి సాహితీ సమరాంగణ సార్వ బౌమునిగా కీర్తి గడించిన చక్రవత్తి శ్రీకష్ణదేవరాయలు. ఆయన ఆస్థానము భువన విజయంలో నిత్యం సాహతీ గోష్టులు, చర్చలు జరిగేవని మనం చదువుకున్నాం. ఇప్పుడు ఆవిధంగా నిత్యం సాహితీ గోష్టులు, కవి సమ్మేళనాలు, భాషా పోటీలు నిర్వహిస్తున్న చోటు తెలుగు సాహిత్య సాంస్కృతిక సయతి కళామందిరం. పాతికేళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ కొన్ని రూ.లక్షలను వెచ్చించి గంగవరంలోని సాయినగర్‌లో కళామందిరాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఏడాధికి సుమారు 100కార్యక్రమాల చొప్పున చేపడుతున్నారు. కార్యక్రమానికి వారే పూర్తి ఖర్చు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఏడాధికి కేవలం పిల్లలకు బహుమతులు అందజేయడానికి రూ.2లక్షల వరకూ ఖర్చు చేస్తున్నారు. ఇక కవులు, రచయితల సాహితీ గోష్టులు, కవిసమ్మేళనాలు, చర్చలు, సత్కారాలు, సన్మానాలకు అయ్యే ఇరు లక్షల్లోనే. సాధారణ జీవతాన్ని గడుపుతూ ఇలా సేవా కార్యక్రమాలకు ఖర్చు చేస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఇటీవల బాలోత్సవం పేరిట మిత్రుల సహకారంతో 1500మంది పిల్లలకు భాషా పోటీలు నిర్వహించి 200మందికి బహుమతులు ప్రదానం చేశారు. ఇప్పటి వరకూ లక్షకుపైగా పుస్తకాలను పంచిపెట్టారు. శక్తి ఉన్నంత కాలం తెలుగు తల్లి సేవాలో ఉంటామని ఆ ఆదర్శ దంపతులు చెబుతున్నారు. అందుకే తులసినాథంనాయుడును పలువురు సాహితీ మిత్రులు అభినవ శ్రీకృష్ణదేవరాయలుగా కొనయాడుతుంటారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆదర్శప్రాయులను అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా గుర్తు చేసుకోవడం ఆవశ్యకం.

న్యాయం చేసి ఆదుకోండి..

తహశీల్దారుకు ముస్లిం కుటుంబాల వినతి

ప్రజాశక్తి - కోట : ఎన్నో సంవత్సరాలుగా తమ ఆధీనంలో ఉన్న భూమిని ముస్లిం కుటుంబాలకు ఉపయోగపడేలా న్యాయం చేయాలని చిట్టేడు ముస్లిం మైనారిటీలు ఎస్ కే రఫీ, మస్తాన్ బాష, అమీర్ బాష కోరారు. ఈ సందర్భంగా మంగళవారం కోట మండలంలోని స్థానిక తహశీల్దారు కార్యాలయంలో చిట్టేడు గ్రామానికి చెందిన ముస్లిం కుటుంబాలు తహశీల్దారు డి నాగరాజరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ ముస్లిం కుటుంబాలకు కోట మండలంలోని టీడీపీ నాయకులు, కోట ఎంపీటీసీ షేక్ షంసుద్దీన్ మద్దతు పలికారు. అనంతరం చిట్టేడు ముస్లిం సోదరులు రఫీ, అమీర్ బాష, మస్తాన్ సాహెబ్ మాట్లాడుతూ చిట్టేడు గ్రామం అంకమ్మ మిటలో తమ పూర్వికుల కాలం నుండి సర్వే నంబర్ 341 లో 2-20 ఎకరాలు తమ ఆధీనంలో ఉండి శ్మశాన వాటిక, రంజాన్, బక్రీద్‌లు లాంటి మరెన్నో వాటికి ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. అదే గ్రామానికి చెందిన షెడ్యూల్ తెగ ఎరుకుల కులానికి చెందిన వారికి ముస్లిం శ్మశాన వాటికను వారికి ఇవ్వాలనే యత్నిస్తున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి తమ ఆధీనంలో ఉన్న భూమిని తమకే దక్కేలా న్యాయం చేయాలని తహశీల్దారును కోరారు. తహశీల్దారు స్పందించి స్థానిక ఆర్ఐ, సర్వేయర్, విఆర్ఓ లతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలిస్తామని ముస్లిం మైనారిటీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చిట్టేడు ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.